విశాలాంధ్ర విజయనగరం
సోమవారం 28, అక్టోబర్ 2024

108 వాహన కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 108 వాహనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారం చేసి న్యాయం చేయాలని స్థానిక 108 వాహన సిబ్బంది యూనియన్ అధ్యక్షులు అప్పలనాయుడు, కార్యదర్శి బోను వెంకటరమణ, వేణు, సతీష్ కళ్యాణి, నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా 108 సిబ్బంది చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా బొబ్బిల్లో కూడా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వారు విలేకరులు తెలిపారు. తక్షణమే సమస్యల పరిష్కారం చేయాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 8 వరకు ఆందోళన కొనసాగుతుందని తెలిపారు.

ఇల్లు కట్టకపోతే రద్దయిపోద్ది...!

జామిలో అసంపూర్తిగా ఉన్న జగనన్న లేఅవుట్.

- జిల్లాలో 12వేల ఇళ్ళపట్టాల రద్దుకు రంగం సిద్ధం
- మార్చిలోగా నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యం
- అయోమయంలో అధికారులు

(విశాలాంధ్ర-విజయనగరం)

జిల్లాలో గత ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన ఇళ్ళను ఇప్పటికీ చాలామంది ప్రారంభించలేదు. జగనన్న కాలనీల పేరుతో వందలాది ఇళ్ళను లబ్ధిదారులకు మంజూరు చేసారు. తాము నిర్మిస్తున్నది కాలనీలు కాదని, ఊళ్ళనే ఏర్పాటు చేస్తున్నామని గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పుకుంది. కానీ అనేక కారణాలతో లబ్ధిదారులు ఆయా కాలనీలలో ఇళ్ళకు కనీసం పునాదులు కూడా వేయలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఇటువంటి ఇళ్ళను గుర్తించి వారి పట్టాలను కూడా రద్దు చేసేందుకు రంగం సిద్దం చేసింది. ఇప్పటికే గృహనిర్మాణశాఖ అధికారులకు ఆదేశాలు అందినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులమేరకు ఆయా మండలాలలో ఇప్పటికీ ఇళ్ళను ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను సిద్దంచేసారు. ప్రభుత్వం ఆదేశించిన వెంటనే ఇళ్ళను రద్దు చేసేందుకు సిద్దమయ్యారు.

జిల్లాలో 12వేలమంది ఇళ్ళు రద్దు..

విజయనగరం జిల్లాలో మొత్తం 81,999 ఇళ్ళులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 11,191 మంది అసలు ప్రారంభించలేదని శాఖాపరమైన నివేదికలో తెలిపారు. మొత్తం మంజూరు 50శాతం మాత్రమే వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. దీంతో పనులు ప్రారంభించని దాదాపు 12 వేలమంది ఇళ్ల రద్దు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అయితే వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి అసలు ప్రారంభించని ఇళ్ళను పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించడం జరిగింది. ఈ విషయమై జిల్లా పరిషత్ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి, రాష్ట్ర సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు.

మొదటినుంచి గృహనిర్మాణశాఖ నిర్లక్ష్యమే..

జగనన్న కాలనీల పేరుతో వందలాదిమందికి ఇళ్ళను మంజూరు చేస్తే గృహ నిర్మాణశాఖ అధికారులు ఇళ్ళనిర్మాణంపై కనీస దృష్టి సారించలేదనేది బహిరంగ రహస్యం.. కేవలం బిల్లులు చెల్లింపులపైనే దృష్టి సారించారని, లబ్ధిదారులను చైతన్యం చేయలేదని ప్రజలు అంటున్నారు. నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలోనూ సిబ్బంది తగిన విధంగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

ప్రభుత్వ చెరువును పరిరక్షణ చేసిన తహశీల్దార్ శ్రీను కు సీపీఐ అభినందనలు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం మిలటరీ కాలనీ వద్ద బిఎస్సార్ ప్రాపర్టీస్ యజమాని బురిడి శంకర్రావు కబ్జా చేసిన చెరువును ఆదివారం తహశీల్దార్ ఎం శ్రీను, విఆర్ఓ సురేష్ స్పందించి అక్రమణ చేసిన ప్రభుత్వ చెరువులో వేసిన గ్రావెల్ ను జెసిబి తో తొలిగించి కబ్జాకు గురైన చెరువు భాగాన్ని చదునుచేసి చెరువును పరిరక్షించినటువంటి రెవెన్యూ యంత్రాంగానికి సిపిఐ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే మిలట్రీ కాలనీ వద్ద బిఎస్సార్ ప్రాపర్టీ యజమాని బురిడి శంకర్రావు ప్రభుత్వ చెరువును చదును చేయడానికి తెచ్చిన గ్రావెల్ ఏ చెరువు నుండి తవ్వకాలు జరిపి తెచ్చారో... దీనిపై కూడాసమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చెరువుల గట్టులపైన. బఫర్ జోన్లో నిర్మించిన అక్రమ కట్టడాలపై తహశీల్దార్ , మున్సిపల్ కమిషనర్ లు స్పందించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీగా డిమాండ్ చేశారు.

తహశీల్దార్ శ్రీను సమక్షంలో ప్రభుత్వ చెరువు లో వేసిన కంకర ను తొలగించిన బిఎస్ఆర్ ప్రాపర్టీ యజమాని శంకర్రావు

విశాలాంధ్ర-బొబ్బిలి: మిలటరీ కాలనీ వద్ద బిఎస్సార్ ప్రాపర్టీ యజమాని బురిడి శంకర్రావు ప్రభుత్వ చెరువును చదును చేసి కబ్జా చేసిన సంఘటనపై తహశీల్దార్ ఎం శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం చెరువు వద్ద వేసిన గ్రావెల్ ను బి ఎస్ ఆర్ ప్రాపర్టీ యజమాని బురిడి శంకర్రావు చెందిన సొంత జెసిబి తో కంకర్ ను తొలగించారు. ఈ ఈ కార్యక్రమంలో మల్లంపేట విఆర్వో సురేష్, సర్వే సిబ్బంది సంతు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామం లో మండల పరిషత్ అభివృద్ధి నిధులు సుమారు రూ.10 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు, సిమెంట్ కాలువ పనులకు చీపురుపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు ఇప్పిలి వెంకట నరసమ్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, అనంతం జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు, సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, మాజీ పిఎసిఎస్ ప్రెసిడెంట్ బెల్లాన త్రినాథ తదితరులు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీపురుపల్లి మండలంలో వున్న 19 గ్రామ పంచాయతీలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు నుంచి చేశామని ఇంకా గ్రామాల్లో అవసరం అయిన రోడ్లు, కాలువలు, మంచినీటి బోర్లు అవసరం అయిన వాటిని గుర్తించి మంజూరు చేస్తామని తెలిపారు,ఈ కార్యక్రమం లో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ,అనంతం, జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు, సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు బెల్లాన త్రినాథరావు, ఇప్పిలి రాము,గవిడి సురేష్,బెల్లానరమణ,పాండ్రంకి వాసు, అప్పలనాయుడు, గణేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం: చిన్న తనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంధా లయాధికారి సి.హెచ్ కృష్ణమూర్తి అన్నారు. తెర్లాం శాఖ గ్రంధాల యంలో గ్రంధాలయంలో ఆది వారం నిర్వహించి కార్యక్రమం సందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం అయింది. పిల్లలతో కథలు పుస్తకాలు, పురాణం ఇతిహాసాలు గ్రంధాలయం లో ముఖ్య అంశాలను చదివించడం జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం అయింది.

మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం...

విశాలాంధ్ర-చీపురుపల్లి: మండలం లోని గ్రామాల వారీగా మౌలిక వసతులను కల్పించడమే ప్రధాన ధ్యేయంగా మండల పరిషత్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడు తున్నామని చీపురుపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు ఇప్పిలి వెంకట నరసమ్మ, జడ్పిటిసి వలిరెడ్డి శిరీషలు అన్నారు. ఆదివారం చీపురుపల్లి మండలం రామలింగాపురంలో సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన జరిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల వారీగా పనులను గుర్తించి సమస్యలు ఉన్నచోట తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, మురికి కాలువల నిర్మాణం కొరకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, జిల్లా వైఎస్ఆర్సిపి నాయకులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, మాజీ జెడ్పిటిసి మీసాల వరహాల నాయుడు, సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, మాజీ పిఎసిఎస్ ప్రెసిడెంట్ బెల్లాన త్రినాథ శంకుస్థాపన చేసారు,. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీపురుపల్లి మండలంలో వున్న 19 గ్రామ పంచాయతీ ల లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు మండల పరిషత్, జిల్లా పరిషత్ ద్వారా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి రాము, గవిడి సురేష్, బెల్లాన రమణ, పాండ్రంకి వాసు, అప్పలనాయుడు, గణేష్ పాల్గొన్నారు.

వినయ్ కి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్ : మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన పతివాడ వినయ్‌కుమార్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ మెన్ కి సెలెక్ట్ అయిన సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గల కుసుమహరణథ్ గుడి వద్ద పట్టణ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వినయ్ కుమార్ కు ఆదివారం అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా కోచ్ ఆల్తి తాతబాబు మాట్లాడుతూ. ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో జరగబోయే కబడ్డీ పోటీలలో జేఎన్టీయూ గురజాడ యూనివర్సిటీ నుంచి వినయ్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడని ఆయన ఎంపికపట్ల పట్టణంలోని సీనియర్ కబడ్డీ క్రీడాకారులు అభినందనలు తెలియజేశారని అన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు బుగత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కబడ్డీ క్రీడలకు శక్తి సామర్థ్యాలు ఎంతో అవసరమని ఇందుకు అవసరమైన పోషక ఆహారాన్ని తీసుకొని ముమ్ముందు మరిన్ని విజయాలు సాధించే విధంగా క్రీడాకారుడు అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, సీనియర్ క్రీడాకారులు బుగత వెంకటేశ్వరరావు, రేగలబంద చిట్టిబాబు, కాపు గంటి శ్రీనివాసరావు మొదలగువారు క్రీడాకారునికి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బంగారమ్మ, సన్యాసిరావు మాస్టారు, పెదగాడ రాజు, బ్రహ్మాజీ, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

బాణ సంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : దీపావళి పండుగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా ప్రేలుళ్ళు, ప్రమాదాలు జరగకుండా బాణసంచా నిల్వఉంచే గోడౌన్లు, విక్రయించే లైసెన్సు షాపులు, తాత్కాలిక బాణసంచా విక్రయ షాపులవద్ద వ్యాపారులు తప్పని సరిగా ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టే విధంగా తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయించేందుకు విక్రయదారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు పొందాలన్నారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయాలు చేపట్టే వ్యాపారులు తమ తాత్కాలిక షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా ఉండే విధంగాను, పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే షాపులు ఏర్పాటు చేయాలన్నారు. షాపుల మధ్య తప్పనిసరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలన్నారు. బాణసంచా అనుమతులు ఉన్న షాపుల నుండి మాత్రమే తాత్కాలిక లైసెన్సులు పొందిన విక్రయదారులు బాణసంచాను కొనుగోళ్ళు చేయాలన్నారు. షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్బులు, ఫైర్ నియంత్రికలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. షాపుల వద్ద ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండి ఒకేసారి కొనుగోలు చేయకుండా చూసు కోవాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న వస్తువులు, దగ్గరలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను, ఫ్లెక్సీలను తాత్కాలిక షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. మనుష్యులు ప్రయాణించే వాహనాల్లో బాణసంచాను రవాణ చేయకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండే మెటీరియల్తో మాత్రమే అనగా ఆస్ బెస్టాస్, జి.ఎస్. రేకులతో తాత్కాలిక షాపులను ఏర్పాటుకు వినియోగించాలన్నారు. బాణసంచా విక్రయాలు, నిల్వలు ఉంచే షాపులు, గోడౌన్ల వద్ద వెలుగు ఉండే విధంగాను, లోపలకు, బయటకు వెళ్ళేందుకు వేరే వేరుగా ద్వారాలు ఉండే విధంగా చూడాలన్నారు. గోడౌన్లలో సురక్షితమైన వైరింగు, ఫైర్ అలారమ్స్ ఉండే విధంగా షాపు యజమానులు చర్యలు చేపట్టే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. షాపు యజమానులు బాణసంచా విక్రయించే షాపులు, నిల్వ ఉండే గోడౌన్లు, తాత్కాలిక షాపుల వద్ద ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ అన్నింటిని తప్పనిసరిగా పాటించాలని, లైసెన్సులో అధికారులు సూచించిన సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించే విధంగా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఆదేశించారు.

ఉద్యాన రైతుకు బిందు సేద్యం వరం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం: ఉద్యాన రైతులకు బిందు సేద్యం ఒక వరమని, దీనిని ప్రతి రైతు వినియోగించుకొని లబ్ధి పొందాలని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబెద్కర్, శాసన సభ్యులు అదితి గజపతిరాజు రైతులకు తొలి విడత బిందు , తుంపర సేద్య పరికరాలను పంపిణీ చేశారు. ఈ పరికరాల వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ బిందు సేద్యం వల్ల భూగర్భ జలాల పరిరక్షణతోపాటు విద్యుత్ వినియోగం సాగుఖర్చులో ఆదా అవుతుందని, రైతుకు రాబడి అధికంగా వస్తుందని తెలిపారు. నీటివసతి (బోరు/బావి) విద్యుత్ సౌకర్యం (మోటార్లకు/ ఆయిల్ ఇంజన్లకు) ఉన్నవారెవరికైనా ఈ పథకం క్రింద సూక్ష్మనీటి సేద్య పరికరాలు పొందుటకు అర్హులని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాదికి 3050 హెక్టార్లలో బిందు సేద్యం లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 86 మంది రైతులకు 91.81 లక్షల విలువైన పరికరాలకు 58.17 లక్షల రాయితీ పై అందజేశామన్నారు.

బిందు సేద్య పరికరాల పై రాయితీ:

చిన్న మరియు సన్నకారు రైతులకు రూ. 2,18,000/- రాయితీ వరకు డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీతో 5.00 ఎకరాలకు మించకుండా అందించడం జరుగుతుందన్నారు. 5.00 నుండి 12.50 ఎకరాల కలిగిన రైతులకు రూ. 3,10,000/- రాయితీ వరకు డ్రిప్ పరికరాలను ప్రస్తుతం 50% రాయితీతో అందించడం జరుగుతొందన్నారు.

తుంపర్ల సేద్య పరికరాలపై రాయితీ:

చిన్న మరియు సన్నకారు రైతులకు తుంపర్ల సేద్య పరికరాలను 55 శాతం రాయితీ తో 5.00 ఎకరాలకు మించకుండా అందించడం జరుగుతుందని, 5.00 నుండి 12.50 ఎకరాలు కలిగిన రైతులకు తుంపర్ల సేద్య పరికరాలను 45% రాయితీతో అందించడం జరుగుతుందన్నారు.

బిందు, తుంపర్ల సేద్యము పరికరాలు రాయితీ పై పొందగోరే రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఏపీ ఎంఐపీ ఆన్ లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్న పిమ్మట రైతు ఎంచుకున్న మైక్రో ఇరిగేషన్ కంపెనీ వారి ద్వారా రైతు పొలములో సర్వే మరియు అంచనా విలువలను తయారు చేసిన తరువాత, రైతు చెల్లించవలసిన రైతు వాటా వివరములు ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేసుకున్న మొబైల్ నెంబరుకు సంక్షిప్త సమాచారం పంపించడం జరుగుతుంది తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ.పి. ఎం.ఐ.పి పి.డి లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామారావు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులపై ఆనందో బ్రహ్మ ఫ్లాష్ మాబ్ కు విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో" పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా డిఎస్పి. పి.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ప్రజల్లో పోలీసుల సేవలు, త్యాగాల పట్ల అవగాహన కల్పించేందుకు సిఐ కె.సతీష్‌కుమార్ ప్రతీ రోజూ విభిన్న కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ఆనందో బ్రహ్మ డాన్స్ అకాడమీ విద్యార్థుల చే ఫ్లాష్ మాబ్ నృత్యాలను ఏర్పాటు చేసారు. అమరవీరులైన పోలీసుల త్యాగాలను, పోలీసుల గొప్ప తనాన్ని వివరించే సినిమా పాటలకు విద్యార్థులు లయబద్ధంగా డాన్సులు చేయడం ఆకట్టుకుంది. ఆనందో బ్రహ్మ సభ్యుడు బి జి గంగాధర్ మాస్టారు పోలీస్ అమరవీరుల సేవలను కొనియాడుతూ ప్రేరణ గీతాలు ఆలపించారు. పది నిమిషాలు తాండ్ర పాపరాయ విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. ఫ్లాష్ మాబ్ లాంటి వినూత్న కార్యక్రమం ద్వారా అమరవీరులైన పోలీసులకు నివాళులు అర్పించిన ఆనందో బ్రహ్మ అకాడమీ నిర్వాహకులు యం.విజయ మోహన్ రావు, బి.జి.గంగాధర్, బి.భవాని, కే.సత్య, కే.కమల్‌కుమార్, చప్ప అప్పల నాయుడు, రాముద్రి ,దూపం వాసు, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవాళ్ల కిరణ కుమార్‌లను డిఎస్పి. శ్రీనివాసరావు అభినందించారు. ఆనందోబ్రహ్మ డాన్స్ అకాడమీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు.

12వ పిఆర్‌సి సంబంధించి మధ్యంతర భృతి ప్రకటించాలి

ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: 12వ పిఆర్‌సి సంబంధించి మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి శ్యామ్ డిమాండ్ చేశారు. ఆదివారంస్థానిక అమర్ భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) రాష్ట్ర కార్యదర్శి డి శ్యామ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పి.ఆర్.సి సంబంధించి గత ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం, చైర్మన్ రాజీనామా చేయడంవల్ల కమిషన్ ఏర్పాటు జరగలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలల అయినప్పటికీ ఇంతవరకు నూతన చైర్మన్ ఏర్పాటు చేయలేదన్నారు. తక్షణమే నూతన చైర్మన్ నియామకం జరిపి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, తక్షణమే పెండింగ్ డి. ఏ లు ప్రకటించాలని, ఇప్పటికే డిఏ ఎరియర్స్ గత పిఆర్సి ఏరియర్స్ బకాయిలను విడుదల చేయాలని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నందున విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతీసుకుని దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ టి యు జిల్లా నాయకులు ఎస్.ఎస్ దొర, డి.శ్రీరామ్, బంగారయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన షేక్ మారేస్



విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం తోట పాలెం లో బాలాజీ నగర్ ఎదురుగా మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం షేక్ మారేష్, 33 వ వార్డు అభ్యర్థి వారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధానంద్, డాక్టర్ సుకన్య, మెడికల్ క్యాంపు ఉద్దేశించి మాట్లా డుతూ క్యాన్సర్ పైన తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన ఉన్న అవగా హన గురించి తెలిపారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ కోఆర్డినేటర్ సి.హెచ్ స్వాతి, కంది వలస సురేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడి రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర-గరివిడి: పాత రైల్వే గేట్ ప్రాంతంలో అండర్ ట్రాక్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 150 కుటుంబాలు వివిధ వ్యాపార వాణిజ్య సముదాయాలను నిర్వహించి దశాబ్దాలుగా జీవనం గడుపుతున్నారని, ఇక్కడి రైల్వే ట్రాక్ ఇరువైపులా దారిని మూసివేసి రహదారిని స్తంభింప చేయడంతో ఇరువైపులా దాదాపు 22 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోవడంతో, తమ వ్యాపారాలు పడిపోయాయని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి పాత రైల్వే గేటు ప్రాంతంలో, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగిన తర్వాత, గరివిడి పట్టణం రెండుగా చీలిపోయిందని, కొద్దిరోజుల క్రితం వరకు క్రింద ట్రాక్ మార్గంలో నడకదారి ఉండేదని, తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్న అభిప్రాయంతో ఆ దారిని కూడా పూర్తిగా రైల్వే శాఖ అడ్డు గోడ నిర్మించి మూసివేయడంతో, అటు గ్రామాల ప్రజలు ఇటు, ఇటు గ్రామాల ప్రజలు అటు, రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయని స్థానికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపార,వర్తక, ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడుని కలిసి, రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రామ్ మల్లిక్ నాయుడు, స్థానిక రైల్వే గేట్ ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక శాసనసభ్యులు, ఇతర పెద్దలు, దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాగా కొండనాలికకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా, గరివిడి రైల్వే గేటు సమస్యను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే, పట్టణం రెండుగా చీలిపోయి, ఇరువైపు గ్రామాల రాకపోకలు స్తంభించిపోయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఇరువైపులా ఇరుకైన రోడ్ల అవ్వడంతో , రెండు వైపులా భారీ వాహనాలు, లారీలు, బస్సులు, వంటి వాహనాలతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతున్నదని అన్నారు. రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఇక్కడి స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల, సమస్యను పరిష్కరించినట్లు అవుతుందని, ఈ సమస్యపై స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు, పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితర నేతల దృష్టికి ఈ సమస్యను తీసుకెళతామని స్థానిక వర్తక వ్యాపార ప్రతినిధులతో అన్నారు.

వైసీపి నుంచి జనసేన పార్టీలోకి చేరికలు

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం వైసిపి యూత్ విభాగం కన్వీనర్ నేమాపు వెంకటేష్ సీతయ్యపేట గ్రామం వైస్ సర్పంచ్ నేమాపు భాను తమ 50 మంది ముఖ్యఅనుచరులతో బొబ్బిలి జనసైనికుల నిలయంలో బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్ మరియు తీయల జగదీష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం మండల అధ్యక్షులు బవిరెడ్డి మహేష్, వీరమహిళలు గైనేడి రమ్య, భద్రగిరి సత్య, నాయకులు గేదెల శరత్, కలిశెట్టి ప్రశాంత్, రేవెళ్ల కిరణ్, వెలగ శ్రీను, దిబ్బ కళ్యాణ్, చింతాడ అనంత్, పోతల శివశంకర్, పిల్లా తిరుపతి, పిల్లా సతీష్, కింతలవానిపేట శ్యామ్ పాల్గొన్నారు.

మూగబోయిన సంచార గ్రంథాలయం

- ఆశయ రమణ మృతితో చీపురుపల్లిలో విషాదఛాయలు

రెడ్డి (ఆశయ) రమణ ఫైల్

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఆయన పేరు వింటే స్వచ్ఛంద సేవ గుర్తొస్తుంది.. చిన్న పెద్ద ముసలి,ముతక, అనాధ, యువత, అనే తేడా లేకుండా అందరి గుండెల్లో స్వచ్ఛంద సేవకుడిగా, సంచార గ్రంథాలయం ద్వారా విద్యార్థులకు, యువతకు, అక్షర సంపాదనను అందించే ఆశయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రమణ అకాల మరణంతో చీపురుపల్లి పట్టణంలో విషాదఛాయలు అమలుకున్నాయి. చీపురుపల్లి తో పాటు గరివిడి గుర్ల మేరకు ముదుదాం విజయనగరం జిల్లాలో పలు ప్రాంతాలకు పరిచయస్తుడిగాను, స్వచ్ఛంద సేవకుడు గాను గుర్తింపు పొందిన, రెడ్డి రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో తలకు బలమైన గాయమై విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. సంస్థ ఆధ్వర్యంలో కొన్ని వేల మొక్కలు నాటి జీవం పోసిన రమణ గుండె ఒక్కసారిగా ఆగిపోవడంతో పలువురు ప్రముఖుల సైతం రమణ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సంచార గ్రంథాలయం ద్వారా ఎంతోమంది విద్యార్థులకు యువతకు వందలాది పుస్తకాలను పరిచయం చేసిన రెడ్డి రమణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మన్ననలు కూడా ఇటీవల పొందారు. రాజాంలోని ఓ ప్రైవేటు సంస్థలో నెలకు 12 వేల రూపాయలకు ఉద్యోగం చేస్తూ, తనకు వచ్చిన డబ్బుల్లో కొంత మొత్తాన్ని సంచార గ్రంథాలయం కేటాయించడంతోపాటు కొంతమంది దాతలు సహాయంతో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను కూడా విరివిగా నిర్వహించారు. స్వచ్ఛంద సేవలతో రాష్ట్రస్థాయితోపాటు జిల్లా స్థాయిలో


రెడ్డి (ఆశయ) రమణ ఫైల్

పలు ప్రశంసలు పొందిన రమణ అకాల మరణం పట్ల పలు స్వచ్ఛంద సేవా సంస్థలో పాటు రాజకీయ ప్రముఖులు సామాజిక సేవా కార్యకర్తలు వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నారు. ఎంతోమంది అనాధ సవాలకు స్వచ్ఛంద సేవలో భాగంగా అంత్యక్రియలు జరిపిన రమణ అకాల మరణం పొందడం పట్ల రాజకీయ ప్రముఖుల సైతంసంతాపం తెలియజేస్తూ కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు. సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేసిన రమణ కుటుంబాన్ని సామాజిక వాదులు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్టోబర్ 29న మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనండి

మున్సిపల్ కార్మికులకు సిటూ పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ ,ఇతర సిబ్బంది స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 29న మంగళవారం మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) కార్పొరేషన్ కమిటీ అధ్యక్షులు బి.భాస్కరరావు, ఏ.జగన్మోహన్రావు లు పిలుపునిచ్చారు. ఆదివారం పొలాసుపత్రి మున్సిపల్ మస్తర్ పాయింట్ వద్ద జరిగిన నిరసనలో వారు మాట్లాడుతూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ ఇతర సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనిముట్లు రక్షణ పరికరాలు తగినంత లేకుండా పనులు ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. పట్టణ విస్తీర్ణం, జనాభా పెరుగుతుందని పనిచేసే కార్మికుల సంఖ్య మాత్రం తగ్గిపోతుందని, ఉన్న వారి పైనే తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. మరణించిన రిటైర్ అయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మట్టిఖర్చులు, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, 62 ఏళ్ల వరకు కొనసాగించాలని, థర్డ్ పార్టీ విధానంలో ఉన్న పంప్ హౌస్, లీకులు, వాల్ ఆపరేటర్లు, ప్లాంటేషన్ పార్కుల్లో పనిచేసే కార్మికులకు టెండర్ ప్రకారం 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, బకాయిలు , ఏరియార్స్, ఇవ్వాలని , ఇంజనీరింగ్ ఇతర నాన్ పిహెచ్ వర్కర్లకు బేసిక్ వేతనం 21000, టెక్నికల్ వేతనం 24,500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా జరుగుతుందన్నారు. ధర్నాలో అన్ని రకాల మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిటీ సభ్యులు అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కీ.శే. వెంకటశాస్త్రి సాహితీ రంగానికి విశేష కృషి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం లో ఆదివారం రాత్రి విజయం భావన 540వ సాహిత్య సభ 'నాటకేషు శాకుంతల ప్రదర్శన జరిగింది. విజయ భావన వ్యవస్థాపక గౌరవాధ్యక్షులు కూరెళ్ళ వెంకటశాస్త్రి వర్ధంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కీ.శే. వెంకటశాస్త్రి చిత్రపటానికి రచయితలు, కవులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభాధ్యక్షులుగా వ్యవహరించిన ప్రముఖ చార్టెడ్ ఆడిటర్ ఇఆర్.సోమయాజులు(రాంజీ) మాట్లాడుతూ సాహితీ రంగాన ఎన్నోఏళ్లుగా చేస్తున్న కృషి వివరించారు. ప్రతినెలాసాహితీ సభను నిర్వహిస్తున్నందుకు సంస్థకు అభినందనలు తెలిపారు. ప్రధాన వక్తగా విచ్చేసిన మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల విశ్రాంత ఆచార్యులు, వైయాకరణ సార్వభౌమ డాక్టర్. ఆయల సోమయాజుల గోపాలరావు కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం అంశంపై ప్రసంగించారు. నాటకరచనలో కాళిదాసు సిద్ధహస్తుడు అన్నారు. అలంకారిక రచనా విధానం అయిన మార్గం అన్నారు. భారతకథలో కనిపించే దుష్యంతుని ధీరలలితుడైన నాయకునిగా నిరూపణ చేయడానికి దుర్వాస శాపం ఘట్టం కల్పించి కథకు బరువును ,పాత్రౌచిత్యాన్ని కల్పించారని, కావ్య నాటకానికి ఒక గీటు రాయిగా కాళిదాసు నిలిచారని తెలిపారు. వక్త గోపాలరావు ను ప్రముఖ న్యాయవాది, ముఖ్యఅతిథిగా విచ్చేసిన కూరెళ్ళ లక్ష్మణమూర్తి శాలువా తోసన్మానించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శిరీషారఘురాం. మంగిపూడి రాజు భూషణం, డాక్టర్.హరిచందన్, దుర్గాప్రసాద్, ది గ్రంధాలు సుబ్రహ్మణ్యం, డాక్టర్. జక్కురామక్రుష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కార్యాలయంలో ఏపీటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల సమాయత్తత నిమిత్తం ఏపీటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ బుకారి బాబు అధ్యక్షతన జరిగింది. ఏపీటీఎఫ్ అభ్యర్థి ప్రస్తుత ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ గెలుపు కోసం ఎపిటిఎఫ్ జిల్లా ఎన్నికల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీకి అధ్యక్షులుగా షేక్ బుఖారి బాబు, కన్వీనర్ గా పాలతేరు శ్రీనివాస్ ,జిల్లా సబ్ కమిటీ సభ్యులతో ఎన్నికల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. 2019 నుంచి 2023 వరకు నిరంకుశంగా వ్యవహరించిన పాలకులను ఎదిరించి విధానమండలి లో గొంతెత్తిన పాకలపాటి రఘువర్మను గెలిపించాలని సభ్యులు నిర్ణయించిరి. నిరంకుశ అధిరకరుల పై ఒత్తిడి తేవడం లోను ,కరోనా సమయంలో కరోనా బారినపడి మరణించిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులను ఆదుకోవడంలో, వారికి కారుణ్య నియమాకాలను ఇప్పించడంలోనూ తీవ్రమైన కృషి గుర్తించాలన్నారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ,ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని విధాన పరిషత్ వేదికగా తీసుకొని తీవ్రంగా ప్రయత్నించిన సందర్భాలు ఉన్నాయన్నారు. కేజీబీవీ, ఏపీ ఆదర్శ,గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కరించడంలోనూ తీవ్రంగా కృషిచేసిన పాకలపాటి రఘువర్మను గెలిపించుటకు అందరు కృషి చేయాలని తీర్మానించడం అయినది. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు. సీనియర్ నాయకులు కె .శ్రీనివాసన్, మజ్జి రమేష్ రాష్ట్ర కౌన్సిలర్లు కర్రీ రవి, సత్యనారాయణ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరావు, జిల్లా మీడియా ఇంచార్జ్ మద్రాపు శ్రీనివాసరావు, అన్ని మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించిన 108 సిబ్బంది

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లపై తమ నాయకత్వం జరిపిన చర్చలలో సానుకూలత రాకపోవడంతో ఎస్ కోట 108 సిబ్బంది తమ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఆదివారం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని విధులు నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ తమ కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్:. మండలంలోని బొడ్డవర చెక్పోస్ట్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గంగరాజు తెలిపారు. ఆదివారం ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన లోకేష్ మోహన్ అనే ఇద్దరు వ్యక్తులు అరకు నుంచి విశాఖపట్నం 900 గ్రాములు గంజాయి తీసుకెళ్తుండగా తమ తనిఖీలలో పట్టుపడ్డారని వీరిపై కేసు నమోదు చేశామని నేడు కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఒక మనిషి అవయవదానం... ఏడుగురికి ప్రాణ దానం

విశాలాంధ్ర-బొబ్బిలి : అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యం లో చేపడుతున్న అవయవ దానం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొవాలని అభిమాని ఫౌండేషన్ నిర్వాహకులు రెడ్డి రాజగోపాల్ నాయుడు యువతకు పిలుపునిచ్చారు.మన ప్రాణం పోతే మన శరీరం కాలి బూడిద అయ్యి మట్టిలో కలసి పోయి ఒకరికి ఉపయోగం పడకుండా ఉండే బదులు మనం చనిపోయిన తరువాత మన అవయువాలు ఇంకొకరికి ఉపయోగపడితే ఆ ఆనందం సంతృప్తి చాలా గొప్పది అందికే నేను అనగా నక్కాన మాధవరావు. నేను బొబ్బిలి ప్రాంతం వాసి వెటర్నరీ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్నాను ఈ మంచి కార్యక్రమం లోబొబ్బిలి అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేను భాగస్వామ్యం అయ్యి నా రెండు కళ్ళు దానం చేయడం జరిగి మీరు కూడా ఇలాంటి మంచి కార్యక్రమం లో భాగం అవ్వండి అవయవా దానం చెయ్యండి ఏడుగురికి ప్రాణ దాతలు కావాలని పిలుపునిచ్చారు. అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవయవ దాన సేవా కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు..

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఎటువంటి రికార్డులు లేకుండా వాహనదారులు వాహనాలు నడిపితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని చీపురుపల్లి ఎస్ ఐ ఎల్ దామోదర్ రావు అన్నారు. ఆదివారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని లావేరు రోడ్డులో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ప్రత్యేకించి అక్రమ గంజాయి రవాణా, మందుగొండ సామాగ్రి రవాణా తో పాటు, రికార్డు లేని వాహనాలను విరివిగా తనిఖీ చేశారు. ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, ఆటో యజమానులు అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేయడం వంటి అంశాల పైన పరిశీలన జరిపామ్మన్నారు. ఓవర్ లోడ్ తో ప్రయాణించే ఆటోలను నిలుపుదల చేసి జరగబోయే ప్రమాదాల కోసం కౌన్సిలింగ్ జరిపారు. రానున్న దీపావళి సందర్భంగా అనుమతి లేని మందు గుండా సామాగ్రుల కోసం బస్సులను సైతం తనిఖీ చేశారు. నేరాల నిరోధానికి చేపట్టిన తనిఖీలకు వాహనదారులు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండంటి బిడ్డకు ప్రసవం పోసిన 108 సిబ్బంది

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: ఎస్ కోట 108 సిబ్బంది పురిటి నొప్పులు ఎక్కువయ్యి బాధపడుతున్న గర్భిణీకి మార్గమధ్యంలో సుఖ ప్రసవాన్ని నిర్వహించారు. ఆదివారం ఈ విషయంపై వాహనం పైలెట్ మూర్తి ఈఎంటి మౌనికలు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళకు నొప్పులు ఎక్కువయ్యాయని ఫోను రావడంతో వెంటనే అక్కడకు చేరుకున్నామని తెలిపారు అయితే మండల శివారు బొడ్డవర గ్రామానికి వచ్చేసరికి నొప్పులు ఇంకా ఎక్కువ కావడంతో వాహనాన్ని పక్కకు ఆపి ప్రసవం చేశామని ఈ ప్రసవంలో పండంటి ఆడబిడ్డ పుట్టింది అన్నారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వీరిని ఎస్ కోట సిహెచ్ లో చేర్పించామన్నారు. తమ బిడ్డకు చక్కటి ప్రసవం చేసిన 108 సిబ్బందిని గర్భిణీ కుటుంబ సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-అనకాపల్లి: స్థానిక గవరపాలెము ఎమ్.జి.హెచ్..స్కూల్ లో ఆదివారం పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమములో స్కూల్ ఆవరణలో గల సరస్వతీ దేవి విగ్రహమువద్ద సంఘం అధ్యక్షులు బల్లా నాగ భూషణం , సంఘ సభ్యులతో కలసి పూజ లు నిర్వహించారు.అనంతరము సంఘ ఆత్మీయ సమ్మేళన సమావేశము స్కూల్ మీటింగ్ హాలులో జరుగగా ఈ సంఘంలో నూతన సభ్యుల పరిచయము, సంఘ అభివృద్ధి, సంఘము నిర్వహించ బోయే తదుపరి కార్యక్రమాల ను అధ్యక్షులు బల్లా నాగ భూషణము , కార్య దర్శి దాడి శివరామక్రిష్ణ వివరించారు. వచ్చే డిశంబరు 29 న ఆదివారము ఇదే ఎమ్.జి.హెచ్.స్కూల్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘము అధ్వర్యములో సంఘ యావన్మంది సభ్యులు వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ గవరపాలెము ఎమ్. జి.హెచ్. స్కూల్ ఆవరణలో వనసమారాధన (పిక్నిక్) ను ఘనముగ నిర్వహించటానికి సభ్యులందరూ ఏక గ్రీవముగ నిర్ణయించడం జరిగిందని సంఘ అధ్యక్షులు బల్లా నాగ భూషణం తెలియ జే సారు.ఈ జరుగ బోయే పిక్నిక్ నిర్వహణ భాద్యతలను గూర్చి గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కమిటీ చైర్మన్ పిళ్ళా శివ అప్పారావు, సంఘ గౌరవ సలహా సభ్యులు పి .సత్యనారాయణ (పైసా మాస్టారుచ్) లు మాట్లాడుతూ.ఈ పిక్నిక్ లో వన సమారాధన తో బాటు సాంస్కృతిక , క్రీడా కార్య క్రమాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమములో కోశాధికారి పట్నాల క్రిష్ణ మోహన్, గౌరవ సలహా సలహా సభ్యులు పి.సత్యనారాయణ (పైసా మాస్టరు) సహాయ కార్య దర్శి పి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కొత్తుర్తి రామారావు,పొన్నా చల్మాజీ,మారోజు సత్యనారాయణ, దాడి జగన్నాధరావు, బుద్ధ వీరు నాయుడు,ఎమ్.రాణీ ప్రసాద్ ,పి.సత్యనారాయణ, దాడి శివ, మత్తుర్తి ప్రసాదరావు ,కాంద్రేగుల దుర్గా ప్రసాద్ లు పాల్గొన్నారు..

రక్తదానం చెయ్యండి ప్రాణదాతలు కండి

ఎస్ఐ లోకేశ్వరరావు

విశాలాంధ్ర-గరివిడి: సోమవారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా గరివిడి మండలం ఎస్ఐ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 9:00 గంటలకు గరివిడి పోలీస్ కార్యాలయంలో బ్లడ్ క్యాంప్ (రక్తదాన శిబిర) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది నియోజకవర్గం యువతీ యువకులు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు ఈ బ్లడ్ క్యాంప్ లో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఐ కోరారు.